ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 3 నవంబరు 2024 | 5





వర 'ప్రసాదం'

భక్తునికి, భగవంతునికి అనుసంధానమైంది అగరుబత్తి అన్నట్టుగానే దేవుడికి, భక్తుడికి అనుసంధానమైంది మరొకటి ఉంది. అదే ప్రసాదం. దేవుడికి పెడితే నైవేద్యం. తర్వాత అది భక్తుడికి చేరితే ప్రసాదం. ఈ ప్రసాదం విశేషాలు.. - 6లో

లిఫ్ట్‌లో ఇరుక్కున్న రోగులు

» జీజీహెచ్‌లో తృటిలో తప్పిన ప్రమాదం



లిఫ్ట్‌లో ఇరుక్కున్న రోగులను బయటకు లాగుతున్న సిబ్బంది

జీజీహెచ్(కాకినాడ) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ మెడికల్ విభాగ లిఫ్ట్ శనివారం ఒక్కసారిగా ఆగిపోవడంతో రోగులు అందులో ఇరుక్కొని ఉక్కిరిబిక్కిరిఅయ్యారు. సమయానికి సిబ్బంది అక్కడికి చేరుకుని లిఫ్ట్‌లో ఉండిపోయిన వారిని బయటకు లాగడంతో పెనుప్రమాదం తప్పింది. లిఫ్ట్ కింద భూమిలో ఐదారడుగుల లోతులో నీరు ఊరుతుండడంతో తరచూమొరాయించి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆస్పత్రి సిబ్బంది చెప్తున్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు పటిష్టచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నాయి.

కౌశల్ రాష్ట్రస్థాయి సైన్స్‌పోటీలను జయప్రదం చేయాలి: డీఈవో

కాకినాడ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కౌశల్ రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలను జయప్రదం చేయాలని డీఈవో పి.రమేష్ కోరారు. కౌశల్-2024 గోడపత్రికను డీఈవో ఛాంబర్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా పాఠశాల విద్యాశాఖ సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. డీఈవో మాట్లాడుతూ క్విజ్, పోస్టర్, షార్ట్‌ఫిల్మ్, రీల్స్ అంశాల్లో పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వయాజమాన్యపాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులకు www.bvmap.org అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 15లోపు విద్యార్థుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా సైన్స్‌అధికారి శ్రీనివాస్‌వినీల్, కౌశల్ జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయ సంఘ జిల్లాఅధ్యక్షుడు చలపతి పాల్గొన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

శివోహం!

» కార్తీకమాస పూజలు ప్రారంభం
» పాడ్యమి దీపాల వెలుగులో పాదగయ
» జిల్లాలో ఆలయాలకు కార్తీక శోభ
» తొలిరోజు పోటెత్తిన భక్తులు

పిఠాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలిరోజున పాదగయ క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. పుష్కరిణి పాడ్యమి దీపాలతో వెలుగులు విరజిమ్మింది. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశునికి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా కార్తీకమాసం ఘనంగా ప్రారంభమైంది. ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

పిఠాపురం పాదగయక్షేత్రంలో శనివారం తెల్లవారుజాము 2గంటలకే భక్తుల రాక ప్రారంభమైంది. రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. కార్తీకమాసానికి ప్రారంభసూచకంగా భక్తులు అరటిడొప్పల్లో పాడ్యమి దీపాలు వెలిగించి పుష్కరిణిలో వదిలారు. పాదగయలో పుణ్యస్నానాలు ఆచరించి కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శివదీక్ష ధరించిన భక్తులు పూజలుచేశారు. శివమాలధారులు, భక్తులు ఆలయం చుట్టూ ప్రదిక్షణాలు చేశారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు కాట్నం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.

భీమేశ్వరాలయంలో భక్తుల శివనామస్మరణ

సామర్లకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభంలో భాగంగా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో భక్తులు శనివారం శివనామస్మరణలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, వెంకన్న వేదమంత్రోచ్ఛారణల మధ్య తొలి అభిషేకపూజలను నిర్వహించారు. పుష్పార్చన పూజల తర్వాత స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున 5 గంటలనుంచే భక్తులు ఆలయానికి చేరుకోవడంతో భక్తిపారవశ్యంతో ఆలయ ఆవరణ నిండింది. మధ్యాహ్నం లక్షపత్రిపూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం వద్ద ఆకాశదీప పూజలను ఆలయ పండితులు నిర్వహించారు. కార్తీకదీపారాధన సంఘ ప్రతినిధులు జ్యోతిర్లింగార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన పథకంలో 600మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



సామర్లకోటలో తొలి అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



అంతా తామై..

- ఇంటి మేనేజర్లు.. బాధ్యతల ఇంజనీర్లు
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- వృత్తి.. కుటుంబం.. రెండు కళ్లుగా పయనం
- నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం

చదువులో ఎంత రాణించినా.. ఏ హోదాకు ఎదిగినా.. ఉన్నత స్థానాన్ని అందుకొన్నా.. ఒక మహిళకు గృహిణిగా ఉన్న బాధ్యత ముందు అవన్నీ చిన్నవే. భర్త అవసరాలను తీర్చి.. పిల్లల అలనాపాలనా చూస్తూ.. పెద్దలను సముదాయిస్తూ.. ఇంటిని చక్కబెట్టుకుంటూ.. ముందుకు సాగాలి. ఇంట్లో వాళ్లకు ఏ సమయానికి ఏమి కావాలో చూసుకోవడమే ప్రధాన విధిగా రోజులు గడుపుతుంది. ఆమె చేసే ఇంటి పనులను ఆర్థికంగా లెక్కగడితే పురుషుల సంపాదన దిగదుడుపే. అందుకే ఇంటికి వెలుగు ఇల్లాలు అనే నానుడి అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ బాధ్యతల బరువును మోస్తూనే ఉంటుంది. ఇక వివిధ పదవుల్లో, ఉద్యోగాల్లో ఉన్న గృహిణులైతే అటు ఆ బాధ్యతలు, ఇటు ఇల్లు చక్కబెట్టుకోవడంతోనే జీవితం సాగిపోతుంది. ఈ క్రమంలో తమ సంతోషాలనూ త్యాగం చేస్తారు. ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



కుటుంబసభ్యులతో దీపావళి వేడుకలు చేసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

చిన్న చిన్న సంతోషాలకు దూరమవుతాం..

2007లో పార్వతీపురం ఆర్డీవోగా విధుల్లో చేరాను. 2008లో పెళ్లయింది. ప్రస్తుతం పాప సెవన్త్, బాబు పదో తరగతి. మాకు పరిచయం అయిన తర్వాత పెద్దల అంగీకారంతో వివాహం జరిగింది. అప్పటి నుంచీ గృహిణిగా బాధ్యతలు వచ్చాయి. నాన్న, అమ్మ, అత్తమ్మ ముగ్గురూ మాతోనే ఉంటారు. మామయ్య లేరు. గృహిణిగా నా బాధ్యతల్లో కొన్ని వాళ్లు తీసుకున్నారు. పిల్లల బాధ్యత పూర్తిగా నేను తీసుకుంటాను. ఆఫీస్ పని అయిపోయాక వాళ్లతో గడపడానికి ప్రయత్నిస్తాను. నేను ఇంటికి వెళ్లేప్పటికి రాత్రి 9గంటలు అవుతుంది. చిన్నప్పుడు నా సమయం సర్దుబాటు చేసుకొని వాళ్లకు నేనే వండి పెట్టడం జరిగేది. లంచ్ సమయంలో కాస్త సమయం కుదిరేది కాదు. రాత్రి నేను వెళ్లే వరకూ ఇద్దరు పిల్లలూ వేచి చూస్తుంటారు. ఆలస్యం అయినా అలాగే ఉంటారు. నాకు బాగా ఆలస్యమైతే అన్నం తినేసినా నాకోసం అర్ధరాత్రి వరకూ ఎదురుచూస్తూనే ఉంటారు. మా హస్బండ్ ఢిల్లీరావు డైరెక్టర్ ఆఫ్ ఏపీ అగ్రికల్చర్. విజయవాడలో ఇప్పుడు బాబు ఆయన దగ్గర ఉంటున్నారు. పాప నా దగ్గర ఉంటోంది. ఏదేమైనా పిల్లలతో గడపాల్సిన చాలా సమయం మిస్ అవుతున్నాం. చిన్న చిన్న సంతోషాలను అందించలేకపోతున్నాం. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చినప్పుడు ఎదురెళ్లి దగ్గ రకు తీసుకోలేకపోతున్నాం. వాళ్లు ఆ సమయంలో ఏమైనా మాకు చెప్పాలని ఆతృతతో వచ్చినా మేం ఇంటికెళ్లే వరకూ ఎదురుచూడక తప్పదు. పుట్టినరోజులు మిస్ అవుతాం. మొన్న సెప్టెంబరు 1న బాబు పుట్టినరోజు. ఇక్కడ ఉధృతంగా వరదల వల్ల బిజీగా ఉన్నాను. నాకు సమయం లేకపోవడంతో నా ఆశీర్వాదం కోసం విజయవాడ నుంచి బాబు వచ్చాడు. ఇలాంటివి పిల్లల మనసునూ కాస్త బాధ పెడతాయి. బాధ్యతలు తీసుకొనేప్పుడే ఉద్యోగ బాధ్యతలు ఏమిటి, ఎంత సమయం ఉంటుంది? వ్యక్తిగత జీవితం ఎలా ఉంటుందీ తెలుసు. అందువల్ల వ్యక్తిగత జీవితాన్ని సర్దుబాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు అందరూ వస్తారు. నువ్వు రావడంలేదని మా పాప ప్రశ్నిస్తూనే ఉంటుంది. ఏదో సర్దిబుచ్చుతాం. మేం చాలావరకూ వెళ్లలేం. టీచర్లతో ఫోన్లోనే మాట్లాడే పరిస్థితి ఉంటుంది. పిల్లలే కాకుండా కుటుంబపరంగా జరిగే వేడుకలు తదితర కార్యక్రమాలకు కూడా హాజరుకాలేం. సమయం దొరికినప్పుడు నేనే వండి పెడతాను. నేను ఇంట్లో ఉండే వండి పెట్టాలని పాప డిమాండ్ చేస్తుంది కూడా. పిల్లల విషయంలో చిన్న చిన్న సున్నితమైన అను భవాలు కోల్పోతూ ఉంటాం. ఇంట్లోనే ఉంటున్నాం.. ఏమీ చేయలేకపోతున్నాం.. అని కొందరు గృహిణులు బాధపడుతూ ఉంటారు. కానీ వాళ్ల కంట్రిబ్యూషన్ వాళ్లకు తెలియడం లేదు. ఎంత చదువుకున్నా.. ఎన్ని సర్టిఫికెట్లు ఉన్నా.. ప్రధానంగా విలువలు అనేవి ఇంట్లో నుంచే అలవడతాయి. ఓ ఇంజనీరును, డాక్టరును, కలెక్టర్‌ని తయారుచెయ్యగలం కానీ నైతిక విలువలు, బాధ్యతలు అనేవి కుటుంబ వ్యవస్థ నుంచే, అదీ అమ్మ నుంచే 90 శాతం వస్తాయి. ఎవరైతే పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతారో పిల్లలకు విలువలు అందించడంలో విజయం సాధిస్తారు. చట్టంకంటే ఇంట్లోనే మంచి చెడులను చెప్పగ లిగితే చాలావరకూ సమస్యలు ఉండవు. అందువల్ల పిల్లల క్యారెక్టర్ బిల్డింగ్‌లో గృహిణులు పూర్తి న్యాయం చేయగలుగుతారు. ఒకటి జిల్లా, రెండు సొంత కుటుంబం. రెండు కుటుంబాలనూ బ్యాలెన్స్ చేసుకోవాల్సిన బాధ్యత కూడా మాపైనే ఉంటుంది. గృహిణులకు ప్రపంచ గృహిణుల దినోత్సవ శుభాకాంక్షలు. - ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం

గృహిణి నుంచి.. ఎమ్మెల్యేగా..

ఇంటి బాధ్యతలు ఆమె దినచర్య.. రాజకీయ నాయకుడైన తన భర్త యోగక్షేమాలు, పిల్లలను చదివించుకోవడం ఆమె విధి. వంటావార్పూ సరేసరి. ఆమె కుటుంబంలో ఊహించని షాక్. భర్త గుండెపోటుతో ఆకస్మిక మృతి. ఆ షాక్ నుంచి కోలుకుని తన భర్త ఆశయ సాధనకోసం గృహిణి స్థానం నుంచి నెలల వ్యవధిలో ఎమ్మెల్యే స్థానానికి ఎదిగారు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా. ఏడాదిన్నర కిందట వరకు వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజాకు సతీమణి మాత్రమే. రాజకీయాలతో పనిలేదు. 2019లో టీడీపీ అభ్యర్థిగా వరుపుల రాజా పోటీచేసి ఓడిపోయారు. 2023 మార్చి 4న రాజా గుండెపోటుతో ఆకస్మికంగా మృతితో అప్పటివరకు నుంచి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలు సత్యప్రభపైనే టీడీపీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి విపరీతంగా శ్రమించి పార్టీ బాధ్యతలు ముందుకు నడిపించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రత్తిపాడు ఎమ్మెల్యే అయ్యారు. తన భర్త రాజా నియోజకవర్గానికి ఏం చేయాలో ఏవిధమైన అభివృద్ధి చేపట్టాలో కన్న కలలను ఆమె సాకారం చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవద్దని, ఎదురొడ్డి నిలబడి విజయాన్ని అందుకోవాలని ఆమె సూచించారు.

- ఆంధ్రజ్యోతి/ప్రత్తిపాడు



సీహెచ్ వసంతకుమారి
మహిళా సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి



త్యాగం తప్పదు..

పెళ్లయిన పదేళ్లకే మావారు కాలం చేశారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. గృహిణిని. పెళ్లయిన తర్వాత నా భర్త నేను చదువుకోడానికి చాలా ప్రోత్సాహం ఇచ్చారు. నన్ను గ్రూప్-1 అధికారిగా చూడాలని కోరిక. కానీ తీరలేదు. కానీ 2007లో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాను. డిప్యూటీ జైలర్ (ఎస్ఐ క్యాడర్)గా రాజమండ్రిలో విధుల్లో చేరాను. తర్వాత కడప, వరంగల్‌లో పనిచేసి రాజమండ్రి మహిళా ప్రత్యేక కారాగారం సూరింటెండెంట్‌గా వచ్చాను. కొన్ని కావాలంటే మరికొన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. నేనూ అదే చేశాను. పిల్లలకు మంచి జీవితం అందించాలనేదే ఆశయం. ఉద్యోగ బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా.. పిల్లలకు వండి పెట్టుకోడానికి సమయాన్ని సర్దుబాటు చేసుకోవడం అలవాటైంది.

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



అంగన్‌వాడీలో టీచర్‌గా.. ఎమ్మెల్యేగా శిరీషదేవి

గృహిణి నుంచి అంగన్వాడీ టీచర్.. ఇప్పుడు అసెంబ్లీలో..

ఆమె ఓ సాధారణ గృహిణి. అంగన్వాడీ టీచర్. రెండింటి మధ్యా సమన్వయం చేసుకుంటూ సాగే జీవితం. ఇప్పుడు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి. రాజవొమ్మంగి మండలం గింజర్తి శిరీషదేవి సొంతూరు. సాధారణ గిరిజన కుటుంబం. శిరీషదేవి మూడో ఏటనే ఆమె తండ్రి మరణం. కుటుంబ బాధ్యతలు ఆమె తల్లివే. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు శిరీషదేవి చదువు తన సొంతూరులోనే. ఆరు నుంచి పదో తరగతి వరకు సింగంపల్లి. ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజవొమ్మంగి. డిగ్రీ(బి.ఏ) సెయింట్ పాల్ కళాశాల రాజమహేంద్రవరం. బీఈడీ ఆదిత్య కళాశాల కాకినాడ. ఆ సమయంలోనే శిరీషదేవికి 2015లో మఠం భాస్కర్‌తో వివాహం. వీరిది ప్రేమవివాహం. అత్తగారిది అనంతగిరి. శిరీషదేవి గృహిణిగా జీవితం మొదలైంది. తర్వాత అనంతగిరి అంగన్‌వాడీ టీచరు చిరుద్యోగం పొందారు. చిన్నారులను లాలించడం, ఆడించడం విద్యాబుద్ధులు నేర్పించడంలో శిరీషదేవి బిజీ అయ్యారు. కాలం గిరా గిరా తిరిగింది. ఎవరి జీవితం ఎపుడు మలుపు తిరుగుతుందో తెలియదు కదా. రాష్ట్రమంతా ఎన్నికల వేడి. నారా లోకేశ్ యువగళంలో నిమగ్నమయ్యారు. తన భర్త టీడీపీ నేత కావడంతో ఇద్దరూ కలసి లోకేశ్‌ని కలిశారు. రాజకీయాలపై ఉన్న ఆసక్తిని శిరీషదేవి వ్యక్తపర్చింది. ఎందుకమ్మా అని లోకేశ్ అడగడం, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికని శిరీషదేవి చెప్పడం.. అది విన్న లోకేశ్ ఓ నవ్వు నవ్వి ఊరుకోవడం. సీన్ కట్ చేస్తే.. శిరీషదేవికే పార్టీ టికెట్.. ఎన్నికల ప్రచారం, హామీలు.. అఖండ విజయం.. ఇప్పుడు శిరీషదేవి ఎమ్మెల్యే. మొన్నటికి మొన్న అసెంబ్లీ సమావేశ సమయంలో తన నియోజకవర్గపు సమస్యలు, విలీన మండలాల కష్టాలు, జీవో మూడు ఆవశ్యకతపై గళమెత్తిన తీరు శిరీషదేవికి ప్రత్యేకతను చాటాయి. ఎమ్మెల్యేగా తన తొలి వేతనంతో ప్రాథమిక ఆసుపత్రులకు ఇన్వర్టర్లు కొనివ్వడం, తనకున్న బొలేరు వాహనాన్ని అంబులెన్సుగా మరల్చి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయడం పేదలపై ఆమెకున్న మక్కువను స్పష్టం చేశాయి. ఏదేమైనప్పటికీ ఒక సాధారణ గృహిణిగా జీవితం మొదలుపెట్టి ఒక అంగన్‌వాడీగా జీవితం కొనసాగించిన మిరియాల శిరీషదేవి ఎమ్మెల్యేగా గెలిచి ఏజెన్సీ సమస్యలను పరిష్కరించడమే ప్రథమ కర్తవ్యమని గట్టిగా చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి/చింతూరు

రేషన్ డీలర్ల నియామకం.. జరిగేనా?

» రేషన్‌కార్డుల విభజనలో జాప్యం
» మరోసారి డీలర్లకు నోటీసులు జారీ
» పోస్టుల కోసం ఆశావహుల ఎదురుచూపు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగాఉన్న దుకాణాలకు రేషన్‌డీలర్ల నియామకం ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది. రేషన్‌కార్డుల విభజన చేపట్టి కొత్తగా ఏర్పడిన ఖాళీలతోపాటు పాత వాటికి కూడా డీలర్ల నియామకం చేయాలనే సంకల్పం నెరవేరడం లేదు. జిల్లాలో 1060 రేషన్ దుకాణాలు ఉండగా దీనిలో 133 దుకాణాలకు డీలర్లను నియమించలేదు. వీటిని డ్వాక్రా సంఘాల సభ్యులు తాత్కాలికంగా నడుపుతున్నారు. గత ప్రభుత్వం డీలర్ల ఎంపిక ప్రక్రియ చేయకపోవడం వల్ల డ్వాక్రా సంఘాల సభ్యులే నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఖాళీగా ఉన్న 133 ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు డీలర్లను ఎంపిక చేస్తామని ప్రకటించింది. ఆర్డీవోలు నోటిఫికేషన్ విడుదల చేసి నిబంధనల ప్రకారం ఖాళీలను భర్తీ చేస్తామంది. దీంతో జిల్లాలో ఉపాధి లేకుండా ఉన్న యువత ఎంతో ఆనందం వ్యక్తం చేసింది. రేషన్‌కార్డుల రేషనలైజేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనకు తెరపైకి తెచ్చింది. రేషన్‌కార్డులను విభజించి రేషన్‌షాపుల సంఖ్యను పెంచాలని నిర్ణయించింది. గ్రామాల్లో రేషన్‌షాపు పరిధిలో 400 కార్డులు, పట్టణాల్లో 600 కార్డులు, కార్పొరేషన్‌లో 700 కార్డులు ఉంచేలా విభజన చేయాలని ప్రయత్నించింది. దీన్ని రేషన్‌డీలర్లు వ్యతిరేకించి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో రెండోసారి డీలర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని ఆదేశించారు. వారం క్రితం 141మందికి రెండోసారి అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ అభ్యంతరాలను స్వీకరించి వాటిని కలెక్టర్ షాన్‌మోహన్ ముందు ఉంచుతున్నారు. అభ్యంతాలను పరిశీలించిన తర్వాత రేషన్‌కార్డుల విభజన జరిగే అవకాశం ఉంది. రెండు నెలల నుంచి రెండుసార్లు నోటీసులు ఇవ్వడం, అభ్యంతరాలు తీసుకోవడంతో జాప్యం జరుగుతోంది. దీనివల్ల ఖాళీగా ఉన్న 133 దుకాణాలకు డీలర్లను నియమించలేదు. కొత్తగా పెరుగుతున్నాయని అంచనా వేసిన 141 షాపుల విషయంలో క్లారిటీ లేకుండా పోయింది. దీనివల్ల డీలర్ల నియామక ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైంది.

రోడ్ల మరమ్మతులకు రూ.10కోట్లు మంజూరు

» దశలవారీగా అన్ని పనులు చేపడతాం
» పిఠాపురం-కొండెవరం రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించిన కలెక్టరు

పిఠాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో 1300కిలోమీటర్ల రోడ్లు ఉండగా, వీటి మరమ్మతులకు రూ.200కోట్లతో ప్రతిపాదనలు పంపామని కలెక్టరు షాన్‌మోహన్ తెలిపారు. ఇందులో తొలివిడతగా రూ.10 కోట్లు మంజూరు కాగా వాటితో పనులు చేపడుతున్నామని, మిగిలిన పనులను దశలవారీగా పూర్తిచేస్తామని చెప్పారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పిఠాపురం-కొండెవరం ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను శనివారం ఆయన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులతో కలిసి ప్రారంభించారు. ఎఫ్‌కేపాలెం నుంచి ఉప్పాడ వరకూ ఈ రహదారిని రూ.37లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రహదారులకు మరమ్మతులు చేపట్టడంతోపాటు గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణం జరుగుతోందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ప్రజలు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో మరమ్మతు పనులు చేపట్టారని, వీటిని దశలవారీగా చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కాంతు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, మునిసిపల్ కమిషనరు కనకారావు పాల్గొన్నారు.

పిఠాపురం- కొండెవరం రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న కలెక్టరు షాన్‌మోహన్



ఆదివారం ప్రత్యేకం

వర 'ప్రసాదం'


అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో విక్రయించే రవ్వలడ్డూ ప్రసాదం

అమోఘం.. అయినవిల్లి రవ్వలడ్డూ

అయినవిల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయంలో 2003 నుంచి ప్రసాదాల తయారీ ప్రారంభించారు. అత్యంత రుచికరమైన ప్రసాదంగా పేరొందింది. స్వామివారి ప్రసాదాలుగా లడ్డూ, పులిహోర విక్రయిస్తున్నారు. అర్చకస్వాములే ప్రసాదం తయారుచేస్తున్నారు. రోజుకు 50 కిలోల రవ్వ, 10 కిలోల హెరిటేజ్ నెయ్యితో రవ్వ తయారీ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో 900 నుంచి వెయ్యి లడ్డూలు, పర్వదినాల్లో 3 వేల నుంచి 4 వేల వరకు విక్రయిస్తున్నారు. పులిహోర రోజుకు 40 కిలోలు, పర్వదినాల్లో 800 పులిహోర ప్యాకెట్లు, ప్యాకెట్ ఒకటి రూ.10 వంతున విక్రయిస్తున్నారు.





ఏదైనా ఆలయానికి దేవుడి దర్శనానికి వెళతాం. దర్శనం పూర్తయ్యాక కచ్చితంగా వెళ్లేది ప్రసాదం కోసమే. దేవుడి వర ప్రసాదంగా భావిస్తాం కాబట్టి అది అత్యంత పవిత్రమైందిగా కళ్లకు అద్దుకుని మరీ స్వీకరిస్తాం. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రముఖ ఆలయాలన్నీ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా, నియమనిష్టలతో తయారుచేస్తాయి. అందులో వాడే దినుసులు, నెయ్యి చాలా నాణ్యమైనవి వాడతారు. తయారీ విధానం కూడా అర్చక స్వాముల ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మనకు ఎన్నో విశిష్టమైన ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ప్రసాదాలకూ ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రధానంగా అన్నవరం ప్రసాదం అంటే అందరికీ చాలా ఇష్టం. ఇతర ఆలయాల్లోనూ లడ్డూలు, పులిహోర ప్రసాదాలు ఎంతో రుచిగా రూపొందిస్తారు. మన ఆలయాల్లో ప్రసాదాల ప్రత్యేకతలపై కథనం..

ఆలయాల్లో ప్రసాదాలంటే ఇష్టపడని వారుంటారా..
అన్నవరం ప్రసాదానికి అంతర్జాతీయ ఖ్యాతి
వాడపల్లి సహా ఇతర అన్ని ప్రసిద్ధ ఆలయాల్లోనూ నియమ నిష్టలతో తయారీ
ప్రసాదాల్లో రవ్వ లడ్డూలు, బూందీ లడ్డూలు, పులిహోర..
దేని ప్రత్యేకత దానిదే



అమృతతుల్యం.. అన్నవరం ప్రసాదం

అన్నవరం అనగానే గుర్తొచ్చేది సత్యదేవుడి గోధుమరవ్వ ప్రసాదం. ఇది ఎంతో అమృతతుల్యంగా ఉండడం, విస్తరాకులో అందించడంతో అన్నవరం సామి ప్రసాదం ఆకుతో నాకేయాలి అంటూ చలోక్తులు విసురుతుంటారు. అన్నవరంలో గోధుమరవ్వ ప్రసాదం ఎందుకు తయారుచేస్తారో పురాణ కథ ప్రచారంలో ఉంది. స్కాంద పురాణంలో శూతమహాముని శౌనికాది మునులకు దీని గురించి వివరిస్తారట. గోధుమరవ్వ, పాలు, ఆవునెయ్యి, పంచదార, సుగంధ ద్రవ్యాలతో తయారుచేసి సత్యదేవుడికి నైవేద్యం సమర్పించి ప్రసాదంగా తీసుకోవాలని చెబుతారు. 1891లో సత్యదేవుడి ఆలయం ఆవిర్భావం జరిగింది. అప్పటినుంచి స్వామివారి ఆలయంలో గోధుమరవ్వ ప్రసాదం భక్తులకు అందిస్తున్నారు. ఏటా రెండు కోట్ల ప్యాకెట్లను భక్తులకు విక్రయిస్తుంటారు. ఏ ఆలయంలో అయినా పులిహోర, లడ్డూ ప్రసాదంగా ఉండగా దేశవ్యాప్తంగా అన్నవరం ఆలయంలోనే గోధుమరవ్వ ప్రసాదంగా అందిస్తారు. స్వచ్ఛమైన వేడినీటిలో గోధుమరవ్వను ఉడికించి, ఆవునెయ్యి, పంచదార, సుగంధ ద్రవ్యాలతో వీటిని వంటస్వాములు తయారుచేస్తారు. ఈ ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు లభించింది.

బంగీప్రసాదం: సత్యదేవుడి ఆలయంలో గోధుమరవ్వ ప్రసాదంతోపాటు బంగీప్రసాదం విక్రయిస్తారు. కరాచీ రవ్వతో తయారుచేసే ప్రసాదంలో జీడిపప్పు, కిస్‌మిస్ కూడా వేస్తారు. వారం వరకు నిల్వ ఉండడంతో దూర ప్రాంతాలు ప్రయాణించే భక్తులు వీటిని తీసుకెళతారు. ఏటా సుమారు 20 లక్షల బంగీప్రసాదం ప్యాకెట్లను విక్రయిస్తారు. ఇక ప్రసాద విక్రయాల ద్వారా రూ.40 కోట్లు గోధుమరవ్వ ద్వారానూ, బంగీ ప్రసాదం ద్వారా రూ.10 కోట్లు లభిస్తోంది.

- ఆంధ్రజ్యోతి/అన్నవరం


బంగీ ప్రసాదం



ప్రీతికరం.. అంతర్వేది స్వామివారి లడ్డూ

అంతర్వేది నవంబరు 2: దక్షిణకాశీగా పేరొందిన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారు ప్రతి ఇంట ఇలవేల్పుగా భావిస్తూ పశ్చిమ ముఖంగా దర్శనమిస్తారు. కొన్నిసంవత్సరాలుగా ఎంతో ప్రీతికరమైన స్వామివారి లడ్డూను భక్తులు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తారు. ఒక లడ్డూ ధర రూ.15. ఆలయంలోనే సిబ్బందితో ఈ లడ్డూ తయారుచేస్తారు. ఒక పాకానికి సుమారు 500 లడ్డూలు దాటి తయారవుతాయి. దసరా, కార్తీకమాసం, సంక్రాంతి పర్వదినాలతోపాటు విశేషమైన రోజుల్లో భక్తులు ఎక్కువగా లడ్డూను కొనుగోలు చేస్తారు. లడ్డూ తయారీకి శనగపప్పును ఆలయంలోనే మిల్లింగ్ చేసి పిండి ఆడతారు. విశాఖ డెయిరీ నెయ్యిని, టెండరు ప్రక్రియ ద్వారా కిరాణా సరుకులు లడ్డూ తయారీలో వినియోగిస్తారు.





వెంకన్న లడ్డూ.. భలే రుచి

ఆత్రేయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు వేలాదిగా వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. ఈ క్షేత్రంలో స్వామివారి లడ్డూ ఎంతో ప్రాచుర్యం పొందింది. 2007 నుంచి ఆలయంలోనే స్వామివారి లడ్డూను తయారుచేస్తున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ప్రసాదశాలను నిర్మించారు. కొయంబత్తూరు నుంచి లడ్డూ తయారీకి ప్రత్యేక మిషనరీ తీసుకువచ్చి గ్యాస్ ద్వారా స్వామివారి ప్రసాదం నియమనిబంధనలతో తయారుచేస్తున్నారు. తిరుపతి తరహాలో స్వామివారి లడ్డూను తయారు చేయడం గమనార్హం. ప్రతిరోజూ 31 మంది సిబ్బంది స్వామివారి లడ్డూ తయారీలో నిమగ్నమవుతున్నారు. నెలకు 2.51 లక్షల లడ్డూను తయారు చేస్తూ ఒక్కొక్క లడ్డూ రూ.15కు విక్రయిస్తున్నారు. పచ్చకర్పూరం, జాజికాయ, యాలికలు, కిస్మిస్, జీడిపప్పు, హెరిటేజ్ నెయ్యి, శెనగపిండి, పంచదారతో స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నారు.


వాడపల్లిలో తయారైన బూంది లడ్డూలు.. తయారు చేస్తున్న దృశ్యం



భీమేశ్వరుని ప్రసాదం.. అద్భుతం

ద్రాక్షారామ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రాచీన శైవక్షేత్రం.. పంచారామం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ప్రసాదం తయారీ విక్రయాలు 33 ఏళ్ల కిందట ప్రారంభించారు. పులిహోర, రవ్వలడ్డూ, బూంది లడ్డూ ప్రసాదాలు భక్తులకు అందుబాటులో ఉంటాయి. తొలుత బయట వంట బ్రాహ్మణులకు తయారీ అవకాశం ఇచ్చేవారు. తర్వాత ఆలయ బేడా మండపంలో పాకశాలలో తయారుచేసేవారు. ప్రస్తుతం అన్నప్రసాద భవనం అందుబాటులోకి రావడంతో ప్రసాదాల తయారీ అక్కడే చేస్తున్నారు. బూంది లడ్డూ తయారీకి శనగపిండి, పంచదార, జీడిపప్పు, కిస్‌మిస్‌లు, యాలకులు, ఆవునెయ్యి, పచ్చకర్పూరం, సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతారు. రవ్వలడ్డూ తయారీకి పంచదార, ఆవునెయ్యి, యాలకులు, కరాచీరవ్వ, జీడిపప్పు, కిస్‌మిస్ వాడుతారు. పులిహోర తయారీ కూడా ప్రత్యేకం. నాణ్యమైన దినుసులే వాడతారు. ప్రసాదాలను ఆలయంలో ప్రత్యేక కౌంటర్లు ద్వారా విక్రయాలు జరుపుతారు. 2023-2024 ఏడాదిలో ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.44,39,365 సమకూరింది. ప్రసాదాలు తయారీకి రూ.31,00,391 ఖర్చుచేశారు.

పాదగయ రవ్వలడ్డూ.. ఉత్తరాదికి ప్రీతి

పిఠాపురం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో రవ్వ లడ్డూ ప్రసాదానికి విశిష్టత ఉంది. ఉత్తరాది రాష్ట్రాల భక్తులు ఎక్కువగా ప్రసాదాన్ని కొనుగోలు చేస్తూ ఉంటారు. పులిహోర ప్రసాదం కూడా ఇక్కడ అందుబాటులో ఉంటుంది. పాదగయలో స్వయంభువు కుక్కుటేశ్వరస్వామి, ఆదిశంకరాచార్య ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవారు, స్వయంభువు దత్తాత్రేయస్వామి దర్శనాలకు ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు ఉత్తరాది రాష్ట్రాలు, ఒడిశా, కర్నాటక, గోవా, పశ్చిమ బెంగాల్‌నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. ఇక్కడకు వచ్చిన భక్తులు దర్శనాల తర్వాత తప్పనిసరిగా ఇక్కడ లభించే రవ్వ లడ్డూ ప్రసాదాన్ని తీసుకుంటారు. మిగిలిన దేవస్థానాలకు భిన్నంగా ఈ రవ్వ లడ్డూ ఉంటుంది. కరాచి నూక, పంచదార, నెయ్యి, కిస్‌మిస్, యాలకులు వినియోగిస్తారు. పాలు వాడరు. ఒక్కో రవ్వలడ్డూ ప్రసాదాన్ని రూ.15కి విక్రయిస్తున్నారు. పులిహోర ప్రసాదం రూ.10కి విక్రయిస్తారు. మహాశివరాత్రి, శరన్నవరాత్రులు, కార్తీక, శ్రావణమాసాలు వంటి పర్వదినాల్లో రవ్వలడ్డూ ప్రసాదాలకు అధిక డిమాండ్ ఉంటుందని ఈవో జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు.

మురమళ్లలో కల్యాణం లడ్డూలు ఉచితంగా..

ఐ.పోలవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామి నిత్యకల్యాణోత్సవాలు జరుగుతాయని తెలిసిందే. ఇక్కడ కల్యాణం సందర్భంగా ఉచితంగా లడ్డూలు ఇస్తారు. సుదీర్ఘకాలం అనుభవం ఉన్న వంటస్వామి విశ్వనాథ సత్యనారాయణ ప్రసా దం తయారు చేస్తారు. 1982 నుంచి 2012 వరకు విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఆయన పనిచేశారు. లడ్డూ తయారీ శనగపిండి, పంచదార, నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, యాలకులు, కర్పూరం, జాజికాయ వినియోగిస్తారు. కళ్యాణం భక్తులకు 180గ్రా.ల లడ్డూ ఉచితంగా ఇస్తారు. సాధారణ భక్తులకు 80గ్రా.ల లడ్డూ పది రూపాయలకు అందజేస్తారు. పులిహోర ఇక్కడ ప్రత్యేక రుచితో ఉండడం విశేషం.



బాలబాలాజీ లడ్డూ.. ఆహా ఏమి రుచి

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీ తీరంలో బాలతిరుపతిగా వర్ధిల్లుతున్న అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని భక్తులు పవిత్రంగా భావిస్తారు. మొదట్లో ఆలయ నిర్మాత మోల్లేటి రామస్వామి బూరి, పులిహోర ప్రసాదంగా అందించేవారు. 1981 సంవత్సరంలో ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. స్వచ్ఛమైన నెయ్యితో 80 గ్రాముల బరువుగల లడ్డూను రూ.15కి విక్రయిస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యితో తయారు ఈ లడ్డూను భక్తులు ఇష్టంగా తింటారు.



పంచారామ.. ప్రసాదం

సామర్లకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో కరాచీ (తెల్లనూక) నూక లడ్డూను విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ పులిహోర ప్రసాదంతోపాటు కరాచీ నూక లడ్డూలు కూడా ఆలయం వద్ద భక్తులకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆలయంలోనే తయారుచేస్తున్నారు.

రేపటి నుంచి డిప్యూటీ సీఎం పవన్ పర్యటన

మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ వచ్చే అవకాశం

ఏర్పాట్లు పరిశీలించిన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్


గొల్లప్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటించే ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ 4, 5 తేదీల్లో కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పిఠాపురం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనకు రాష్ట్ర మునిసిపల్‌శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ వచ్చే అవకాశాలు ఉన్నాయి. డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాలను కాకినాడ జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ పరిశీలించారు. సభ ఏర్పా టుకు ఉన్న అవకాశాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో క్రరి స్వప్న, నగర పంచాయతీ కమిషనరు రవికుమార్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ రామకృష్ణ ఉన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో రెండురోజుల పాటు డిప్యూటీ సీఎం పవన్ పర్యటించనున్నారు. సోమవారం 10 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి 11.30 గంటలకు గొల్లప్రోలు చేరుకుంటారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి పలు ప్రారంభోత్సవాలు చేస్తారు. సాయంత్రం కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ ఇనిస్టిట్యూట్‌ను సందర్శిస్తారు. రాత్రి గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బస చేస్తారు. కొత్తపల్లిలో 5న పలు శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళతారు. కాగా 4వ తేదీ పవన్‌కల్యాణ్ పర్యటనలో మంత్రి నారాయణ కూడా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.


ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారుడు


కాకినాడ డీఎస్ఏ మైదానంలో వివిధ పోటీల ఎంపికకు హాజరైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపికలు

కాకినాడ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యే జిల్లాస్థాయి క్రీడాకారులను కాకినాడ డీఎస్ఏ మైదానంలో శనివారం ఎంపిక చేశారు. పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి ఎం పికలను ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు బేస్‌బాల్, జిమ్నాస్టిక్స్, మోడరన్ పెంటతలాన్, రోల్‌బాల్‌ల్లో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని జార్జి తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో చిత్తూరులో జరిగే అండర్-14 బేస్‌బాల్, అండర్-17 విభాగం గుంటూరులో నిర్వహిస్తారన్నారు. మోడరన్ పెంటతలాన్‌లో 9, 10 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహిస్తారన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో జిమ్నాస్టిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతాయన్నారు.

ఘనంగా టీఎన్ఏఐ ద్వైవార్షిక సమావేశం

- నర్సింగ్‌లో నాయకత్వ లక్షణాలపై అవగాహన
- హాజరైన 2500 మంది నర్సింగ్ విద్యార్థులు
- ముఖ్య అతిథిగా ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ వివేకానంద పార్కు ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో శనివారం 78వ ది ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ ద్వైవార్షిక సమావేశం జరిగింది. సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 2,500 మంది నర్సింగ్ విద్యార్థులు హాజరయ్యారు. టీఎన్ఏఐ, ఆర్ఎంసీ నర్సింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో సీఆర్ సంసీర్ బేగం, సంఘ కార్యదర్శి, ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల పర్యవేక్షణలో సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. అతిథిగా ఐఆర్‌సీ వ్యవస్థాపకుడు విశ్రాంత డీఎంహెచ్‌వో డాక్టర్ చక్రధర్ హాజరయ్యారు. ప్రధాన అజెండా లీడర్‌షిప్ ఇన్ నర్సింగ్ ఇన్‌స్పైరింగ్ విజన్ డ్రైవింగ్ చేంజస్ అంశంపై సమావేశం జరిగింది. సదస్సులో డాక్టర్ నరసింహం మాట్లాడుతూ నర్సింగ్ విద్యలోకి అడుగు పెట్టారంటే కచ్చితంగా వారికి సేవా బావం ఉన్న వ్యక్తులై ఉంటారన్నారు. ఈ వృత్తి కన్నా వేరే వృత్తుల్లో జీతభత్యాలు అధికంగా ఉన్నా నర్సింగ్ వైపు మొగ్గు చూపారంటే వారి సేవా గుణం కొనియాడదగిందన్నారు. నర్సింగ్ రంగంలో మారుతున్న ఆధునికతను అందిపుచ్చుకుని నర్సింగ్ వృత్తికి వన్నె తేవాలన్నారు. సదస్సులో ఏపీడీఎంఈ కార్యాలయ నర్సింగ్ డీడీ ఎస్.జ్యోతి, ఆర్ఎంసీ నర్సింగ్ ప్రిన్సిపాల్ ఎం.మునిరత్నమ్మ హాజరయ్యారు. సదస్సులో భాగంగా సైంటిఫిక్ పేపరు ప్రజెంటేషన్ చేపట్టారు. ప్లీనరీ సెషన్స్‌లో నర్సింగ్ ప్రాధాన్యాన్ని వివరించి ఇటీవల జరిగిన అధునాతన మార్పులను ప్రస్తావించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ నరసింహం తదితరులు

ముగిసిన ఉమ్మడి తూర్పుగోదావరి క్రీడాకారుల ఎంపిక

తొండంగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో రోప్ స్కిప్పింగ్, మాల్కమ్ క్రీడల్లో రాష్ట్ర ఈవెంట్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక శనివారం పూర్తయ్యింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం రావికంపాడు ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలో 20 పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు విభాగాల్లోను అండర్ 14, 17లలో బాలబాలికలు హాజరయ్యారు. మాల్కమ్ అండర్ 14 బాలికల విభాగంలో కర్రి దేవి, కోశెట్టి దీప్తి, బత్తిన మురారి దివ్య, దంగా భారతి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో కోశెట్టి తనూజ్, ఆర్.సూర్య, ఎ.సంతోష్‌కుమార్, జి.రాహుల్, కె.శర్విన్‌బాబు, సీహెచ్ వరుణ్‌తేజ ఎంపికయ్యారు. రోప్ స్కిప్పింగ్‌లో కె.తనూజ్, ఆర్.సూర్య, కె.బాబు, సీహెచ్ కల్యాణ్‌రావు దొర, వరుణ్ తేజ దొర, ఎస్.సుజన్, ఎం.మౌళి, కె.శర్విన్ బాబులు ఎంపికయ్యారు. వారంతా ఈనెల 8 నుంచి 10 వరకు భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారు. వివిధ పాఠశాలల పీడీలు క్రీడా నిర్వహణ నిమిత్తం హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ప్రసాదరావు, పీడీ కె.నర్సింహమూర్తి, విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు


పాపికొండల విహారయాత్రకు వెళుతున్న బోటు

పాపికొండలకు పర్యాటకుల సందడి

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో పాపికొండలు అందాలు తిలకించేందుకు పర్యాటకులు శనివారం గోదావరి ముంపు పరివాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా మండలంలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 250 మంది పాపికొండలు వెళ్లారు. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని బోట్లలో తరలివెళ్లారు.



అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కోనసీమవాసులు

అమలాపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరిని నియమించారు. కొంకాపల్లికి చెందిన బ్యాడ్మింటన్ గ్రేడ్-1 నేషనల్ అంపైర్ పాయసం శ్రీనివాసరావు, కామనగరువు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీగా పనిచేస్తున్న గొలకోటి శ్రీనివాస్‌ను ప్రతిష్ఠాత్మకమైన కొటాక్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతలుగా నియమించారు. ఈనెల 5 నుంచి హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈ పోటీలు జరుగుతాయి. శ్రీనివాసరావులను అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌తోపాటు కొత్తపల్లి బాబు, కోనసీమశాఖ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, శరత్‌బాబు, కాశీవిశ్వనాథం, బీవీసీ విద్యాసంస్థల అధినేత బోనం కనకయ్య, పల్లంరాజు అభినందించారు.


రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో కార్తీక స్నానాలు ఆచరిస్తున్న భక్తులు, గోదావరిలో అరటిదొప్పల్లో దీపాలు వదులుతున్న భక్తురాలు

శివోహం!

- పాడ్యమి దీపాలు వదిలిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో కార్తీకమాసం తొలిరోజున శైవక్షేత్రాలు కార్తీకమాస శోభ చేకూరింది. .కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం తెల్లవారుజామున రెండు గంటలకే భక్తుల రాక ప్రారంభమైంది. రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవు, కోటిలింగాల రేవు, దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం, ద్రాక్షారామ భీమేశ్వరాలయంవద్ద పుష్కరిణి, కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం, సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయాల వద్ద భక్తులతో కిక్కిరిశాయి. కార్తీకమాసానికి ప్రారంభ సూచకంగా భక్తులు అరటిడొప్పల్లో పాడ్యమి దీపాలు వెలిగించి వదిలారు.


పిఠాపురం పాదగయ పుష్కరిణిలో అరటిడొప్పలో పాడ్యమి దీపాలు వెలిగించి వదులుతున్న భక్తులు, పూజలు చేస్తున్న మహిళలు

రత్నగిరిపై కార్తీక సందడి

- సత్యదేవుడికి కార్తీకమాస తొలిరోజు ఆదాయం రూ.40 లక్షలు
- ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఈవో రామచంద్రమోహన్


రత్నగిరి కొండపై వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస సందడి ప్రారంభమైంది. తొలిరోజు సుమారు 50 వేలమంది భక్తులు దర్శించుకోగా రూ.40లక్షల ఆదాయం లభించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని 4 గంటల నుంచి స్వామివారి వ్రతాలు, దర్శనాలు ప్రారంభించారు. 2952 జంటలు సత్యదేవుడి వ్రతాలాచరించారు. ఈవో రామచంద్రమోహన్ క్షేత్రస్థాయిలో వ్రతమండపాలు, క్యూలైన్‌లను ప్రారంభించారు. ప్రధానాలయం వద్ద అదనంగా 1200 మంది భక్తులకు సౌకర్యవంతంగా ఉండే క్యూలైన్‌ను, సిట్టింగ్, ప్యాన్లు ఏర్పాటుచేసిన క్యూలైన్‌లను పరిశీలించారు. పశ్చిమరాజగోపురం వద్ద ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి శనివారం అన్నవరం గ్రామానికి చెందిన వీర్ల సత్యసాయితేజ తన మొదటినెల జీతానికి సత్యదేవుడికి సమర్పిస్తానని మొక్కుకోవడంతో రూ.లక్ష విరాళంగా ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. దాతను ఆయన అభినందించారు.

సమాచార కమిషనర్ పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం సమాచార కమిషనర్ ఉదయభాస్కరరెడ్డి స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

ప్రాకారసేవ, రథోత్సవం సాయంత్రానికి మార్పు

సత్యదేవుడి సన్నిధిలో ఉదయం సమయంలో ప్రతి శనివారం నిర్వహించే ప్రాకారసేవ, ఆదివారం నిర్వహించే ఆర్జితసేవ రథోత్సవం కార్తీకమాసం నెలరోజులు భక్తుల రద్దీదృష్ట్యా సాయంత్రం 4.30కి నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. కార్తీకమాసం అనంతరం ఈసేవలు యథావిధిగా ఉదయం జరుగుతాయని రథపాత్‌లో భక్తుల సంచారం శని, ఆదివారాల్లో అధికంగా ఉండడంతో పండితులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

గోవిందా..హరి గోవిందా!

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.45.33లక్షలు


వాడపల్లి వెంకన్న ఆలయంవద్ద బారులుతీరిన భక్తులు


బాలబాలాజీకి పూజలు చేస్తున్న అర్చకుడు

ఆత్రేయపురం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మిహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు గోవిందనామస్మరణతో స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. స్వామివారి ఆలయంలో రామానుజ తిరునక్షత్ర ఉత్సవాలు రెండోరోజు నిర్వహించారు. ప్రకారోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. వివిధసేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.45.33లక్షలు లభించిన ట్లు ఉప కమిషనర్, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

శృంగారవల్లభస్వామికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 2,81,730, అన్నదాన విరాళాలు రూ.74,221 ఆదాయం, కేశ ఖండన ద్వారా రూ.5,480, తులాభారం, కానుకలు ద్వారా రూ.350, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.23,160 వెరసి రూ.3,84,941 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకస్వాములు విశేష పూజలు నిర్వహించారు. శనివారం దేవస్థానం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. కార్తీకమాసం ప్రారంభంకావడంతో వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. స్వామివారికి శనివారం సుప్రభాత సేవ, తొలిహారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ జరిపారు. నిత్యాన్నదానంలో అన్న ప్రసాదం స్వీకరించేందుకు భక్తులు బారులు తీరారు. శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,53,765 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5,540మంది భక్తులు దర్శించుకుని 3386 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


తిరుపతి శృంగారవల్లభస్వామి

చిక్కని పులి

- పట్టు రైతులకు అపార నష్టం
- పంటను వదిలేస్తున్న గిరిజనులు


పట్టుపురుగులు చూపుతున్న తెల్లం గోపయ్య, శాంతమ్మ దంపతులు

కూనవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మన్యంలో పులి సంచారం గిరిజన రైతులకు నష్టం వాటిల్లేలా చేస్తోంది. ప్రతీ ఏడాది గిరిజనులు అడవిలో పట్టుపురుగులు సాగు చేస్తుంటారు. అందులో భాగంగానే ఈఏడాది కూడా స్థానిక గిరిజనులు అడవిలో సాగు చేస్తున్నారు. మొత్తం 3 దఫాలుగా పట్టు పురుగులు సాగు చేస్తారు. ప్రతీ పట్టుపురుగుల సాగుకు రూ.20 వేల నుంచి రూ.30వేలు సంపాదిస్తారు. ఇప్పటికే గిరిజనులు తొలి పంట పూర్తిచేసుకుని రెండోపంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రెండో పంట పురుగుదశలో ఉంది. ఈ దశలో ప్రతీరోజూ వెళ్లి పురుగులు పిట్టలుబారిన పడకుండా చూడాలి. పులి సంచార భయంతో అడవిలోకి వెళ్లాలంటేనే గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. అందులో భాగంగానే గిన్నెలగూడెంనకు చెందిన కొంతమంది గిరిజన రైతు లు మండలంలోని దట్టమైన అడవిలో ఈ టసార్ పట్టు పురుగుల పంటను సాగు చేస్తున్నారు. అయితే అడవిలోకి వెళ్లలేక ఆ పంటను వారు సాగు చేయడం మానేశారు. దీంతో ఒక్కొక్కరికీ రూ.30వేలు వరకు నష్టం వాటిల్లింది. మరికొంతమంది రోడ్డు పక్కన అడవుల్లో ఈ పట్టుపురుగు పంటను సాగు చేస్తున్నారు. గతంలో ఒక్కొక్కరే వెళ్లి పంట సాగు చేసుకు నే వారు. కానీ ఈసారి గుంపులు, గుంపులుగా వెళ్లి పంటను సాగు చేసుకుని ఇంటికి వస్తున్నారు. ఆర్థికంగా నష్టపోయిన తమకు ప్రభుత్వం సాయం చేయాలని పలువురు గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భగవాన్‌పురంలో పట్టుపురుగుల పంటను సాగుచేస్తున్న సుధాకర్ అనే వ్యక్తి అడవిలోకి వెళ్లగా పులి కనిపించడంతో ఒక్కసారిగా ఆ వ్యక్తి పట్టుపురుగుల పంటకు వెళ్లడానికి భయపడుతున్నాడు.

కొనసాగుతున్న పులి అలజడి

కూనవరం మన్యంలో పులి అలజడి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే తమకు కళ్లెదుటే పులి కనిపించిందంటూ పలువురు గిరిజనులు తెలుపుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళుతున్న వారికి సైతం రోడ్డుకు అడ్డంగా పడుకుని ఉండడంతో భయాందోళనకు చెందినట్లు బోదునూరు వాసులు తెలిపారు. కూనవరం అడవుల్లో ఆది నుంచి పులి అలజడి కొనసాగుతూనే ఉంది. 60 సంవత్సరాల క్రితం మండలంలోని చిన్నబోయిన కన్నయ్య మేకలు తోలుతూ ఉండగా అతనిపై అప్పట్లో చిరుతపులి దాడి చేసింది. అదేవిధంగా పదేళ్ల క్రితం వీఆర్‌పురం మండలంలో బూరుగువాడ గ్రామంలో ఒకేరోజు 15 ఎద్దులపై దాడిచేసిన సంఘటన జరిగింది. 2010లో రామచంద్రాపురం అడవుల్లో ఓ పశువుపై దాడిచేసినట్లు ప్రచారం జరిగింది. మరలా ఇప్పుడు పులి పశువులపై దాడిచేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పట్టు పురుగులు సాగు చేయాలంటే భయమేస్తోంది

● తెల్లం గోపయ్య

అడవిలోకి వెళ్లి పట్టుపురుగులు సాగు చేయాలంటే భయమేస్తుంది. గతంలో ఒక్కరమే వెళ్లి సాగు చేసేవాళ్లం. ఇప్పుడు పులి భయంతో కుటుంబం మొత్తం వెళ్లి పట్టుపురుగుల పంట సాగు చేయాల్సి వస్తోంది. మరికొంతమంది పంట సాగు చేయలేక అడవిలోనే వదిలేశారు.

మేలు జరిగేలా నూతన కౌలు చట్టం

అమలాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భూ యజమానులకు ఇబ్బంది లేకుండా కౌలు రైతులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తీసుకువస్తున్నట్టు వ్యవసాయ, సెరీకల్చర్, మార్కెటింగ్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 80శాతం భూములను కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వపరంగా అందాల్సిన బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు కౌలు రైతులకు అందడం లేదన్నారు. భూ యజమానులకు సీసీఆర్సీ కార్డుల మీద అపోహలు ఉండడంవల్ల ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరుకాకపోవడంతో బ్యాంకుల్లో వారికి పంట రుణాలు కూడా లభించడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం భూ యజమానులకు భరోసా కల్పిస్తూ కౌలుదారులకు పంట రుణాలు అందేలా నూతన సాగుదారుల హక్కుచట్టం-2024ను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ఇప్పటికే ముసాయిదాను రూపొందిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి భూ యజమానులు, కౌలుదారులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్టు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాల వారీగా పర్యటనలు చేస్తున్నామన్నారు. అమలాపురం కలెక్టరేట్‌లో శనివారం కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన భూ యజమానులు, కౌలుదారులతో నిర్వహించిన ప్రాంతీయ సమావేశాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. రాష్ట్రంలో అమలవుతున్న కౌలు చట్టాలను రైతులకు ఆయన వివరించారు. 2019 సీసీఆర్సీ చట్ట ప్రకారం కౌలుదారులకు భూ యజమానుల అనుమతితో పదకొండు నెలల కాలపరిమితికి సీసీఆర్సీ కార్డులను రెవెన్యూశాఖ జారీ చేస్తుందన్నారు. అయితే ఈ చట్టంలోని లోపాల వల్ల ఎక్కువ మంది కౌలు రైతులు పంట రుణాలు పొందడంలేదని ప్రభుత్వం గ్రహించిందన్నారు. కౌలు రైతుల సమస్యలు గ్రహించడానికి నూతన చట్టం తీసుకువస్తున్నట్టు తెలిపారు. కొత్త చట్టంలో సీసీఆర్సీ కార్డు జారీ చేసేటప్పుడు భూ యజమాని సిఫార్సు అవసరం లేదన్నారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించుకుని కౌలు రైతులకు కార్డులు జారీ చేయడంతోపాటు రుణాలు మంజూరుచేసే పలు అంశాలను వివరించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు అనేకపథకాలు అందేలా నూతన చట్టాన్ని రూపొందించేలా ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ఎమ్మెల్సీలు యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, జిల్లా వ్యవసాయాధికారులు వి.బోసుబాబు, ఎన్.విజయ్‌కుమార్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్


కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

6వతేదీతో ముగుస్తున్న ఓటు నమోదు

- పట్టభద్రులు ఓటు నమోదుకు అవకాశం
- ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 81213

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రులు నియోజకవర్గం ఓటర్లు జాబితా నమోదు ఈనెల 6వతేదీతో ముగుస్తుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డీఆర్వో వెంకట్రావు తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు పట్టభద్రులుఓటుకోసం 81,213 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా 988, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 15987, తూర్పుగోదావరిజిల్లా 13836, ఏలూరు జిల్లా 14557, కాకినాడ జిల్లా 15183, పశ్చిమగోదావరి జిల్లా 20662 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

జాతి సమైక్యత చాటేందుకే వన సమారాధనలు

- కార్మికశాఖా మంత్రి సుభాష్

కాకినాడ సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతి సమైక్యతను చాటుకునేందుకు వన సమారాధనలు దోహదపడతాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామారావుపేట శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 17న జరుగనున్న శెట్టిబలిజ వన సమారాధన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మం త్రి సుభాష్ మాట్లాడుతూ ఒకేచోట అందరూ కలిసి ఐక్యతను చాటి చెప్పడమే ధ్యేయంగా వనసమారాధన జరగాలన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ శెట్టిబలిజ వర్గానికి చెందిన ప్రజలు సామాజిక వెనుకబాటులో ఉన్నారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, బీసీ నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, చొల్లంగి వేణుగోపాల్, పెంకే శ్రీనివసబాబా, వాసంశెట్టి రాజేశ్వరావు,కుడుపూడి సత్తిబాబు, గుత్తుల శ్రీను, వాసం శెట్టి అంజిబాబు పాల్గొన్నారు.


వనసమారాధన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కన్నీరు మున్నీరుగా..

- శలపాకలో హత్యకు గురైన మృతులకు అంత్యక్రియలు పూర్తి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబీకులు, బంధువులు
- గ్రామంలో కొనసాగుతున్న 144సెక్షన్, పోలీస్ పికెటింగ్


రోధిస్తోన్న బత్తుల చిన్నయ్య కూతురు రాణి

కాకినాడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాక హత్యలతో గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది. అల్లర్లు జరుగకుండా విధించిన 144సెక్షన్‌ను మరికొన్ని రోజులు పొడిగించారు. కాగా హత్యకు గురైన బత్తుల చిన్నయ్య(42), బత్తుల రాజు(40), చిన్నయ్య కొడుకు బత్తుల రమేష్ (25)కు కాకినాడ జీజీహెచ్‌లో శనివారం మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తయింది. దీంతో మృతదేహాలను శలపాకకు తరలించి అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. పొట్టకూటికోసం కువైట్ వెళ్లి అక్కడ పనిచేస్తున్న చిన్నయ్య, రాజుల భార్యలు అనసూయ, లక్ష్మీ తమ భర్తల హత్య గురించి తెలియడంతో హుటాహుటిన కువైట్ నుంచి బయలుదేరి గ్రామానికి వచ్చారు. కుటుంబం బాగు.కోసం తాము విదేశాలకు వెళ్లి ఉపాధి పొందుతుంటే తమ మగవాళ్ల హత్యకు గురవడంతో వీరిద్దరూ కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను చూసి బోరున విలపించారు. ఎంత ఘోరం జరిగిపోయింది. కనీసం గ్రామంలో ఎవరూ ఆపేవారే లేరా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాల వద్ద కూర్చుని వీరిద్దరూ విలపిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. చిన్నయ్య కూతురు, కొడుకు అయితే విగత జీవిగా పడి ఉన్న తండ్రిని చూసి గుండెలు బాదుకుని రోధించారు. బత్తుల రాజు కుమారుడు సూర్య అయితే విగతజీవిగా పడి ఉన్న తండ్రిని చూసి కన్నీరు మున్నీరుగా విలపించాడు. తామంతా కుటుంబం కోసం వేరే దేశాల్లో ఉండి పనిచేస్తున్నామని, తండ్రి గ్రామంలో క్షేమంగానే ఉన్నాడనుకుంటే ఇంత దారుణంగా హత్య చేస్తారా అంటూ రోధించాడు. మృతదేహాలను కొంతసేపు నివాసంవద్ద బంధువుల పరామర్శకు ఉంచగా వారి రోధనలు మిన్నంటాయి. బత్తుల రమేష్ హత్యకు గురవడంతో ఆరునెలల చంటిబిడ్డ అనాథగా మారడంతో తల్లి విలపిస్తూనే ఉంది. తనకు, బిడ్డకు దిక్కెవరంటూ రోధిస్తోంది. ఇంత చిన్న వయసులో తండ్రిని కోల్పోయిన బిడ్డకు రేపొద్దున ఏం చెప్పాలని, తామెలా బతకా లంటూ బోరున విలపిస్తోంది. హత్యకు పాల్పడిన ఐదుగురు నిందితుల్లో ఇప్పటికే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు ఇంకా పరారీలోనే ఉండడంతో వారికోసం గాలిస్తున్నారు.


విషాదంలో బత్తులరాజు భార్య లక్ష్మీ, కూతురు రాజేశ్వరి


ఆరునెలల చంటిబిడ్డతో విషాదంలో రమేష్ భార్య

ఇదొక ప్రకృతి వనం!!



మేడపై కనువిందు చేస్తున్న కనకాంబరం పూలు

- మేడపైనే కూరలు, పండ్లు, పూల మొక్కల పెంపకం
- సహజ సిద్ధంగా పంటలు
- మిద్దె తోట సాగుతో ఆరోగ్యం.. ఆనందం..

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు ఏం తిందామన్నా కల్తీ అయిపోయింది. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఇలా అన్నీ రసాయన మందులతో కలుషితమై పోతున్నాయి. వాటిని తినడంవల్ల ఆరోగ్యమూ పాడవుతోంది. వీటికి చెక్ పెట్టేందుకు ప్రకృతి సిద్ధంగా ఏ రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా తమ ఇంటిపైన మిద్దె తోట సాగు చేపట్టారు కాకినాడకు చెందిన వాసిరెడ్డి సూర్యప్రకాశరావు, సుజాత దంపతులు. గతంలో మార్కెట్‌నుంచి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి ఉపయోగించేవారు. అవితినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రులకు ఎంతో డబ్బు ఖర్చుపెట్టేవారు. దీంతో వీరికి మిద్దె తోట ఆలోచన వచ్చింది. సారవంతమైన మట్టి తెచ్చి ఇంట్లో ఉన్న పనికిరాని డబ్బాలు, డ్రమ్ముల్లో మట్టిని నింపి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్ల విత్తనాలు నాటారు. ఎటువంటి రసాయనిక ఎరువులు వేయకుండా పశువుల పేడ మాత్రమే ఉపయోగిస్తూ సాగు చేపట్టారు.

ఏఏ రకాలు పండిస్తున్నారు..

వంగ, బెండ, టమాటా, చిక్కుడు, పచ్చిమిర్చి మొదలైన కూరగాయలతోపాటు గోంగూర, కొత్తిమీర, తోటకూర వంటి ఆకుకూరలు, మామిడి, జామ, డ్రాగన్, నారింజ, నిమ్మ, బొప్పాయి, బత్తాయి, లక్ష్మీఫలం వంటి పండ్లను కూడా సాగు చేస్తున్నారు. గులాబీ, కనకాంబరం, బంతి, మొదలైన పూల మొక్కలతోపాటు గోరింటాకు వంటి మొక్కలను పెంచుతున్నారు. తమ కుటుంబ అవసరాలకు పోను మిగిలినవి బంధువులకు, స్నేహితులకు ఉచితంగా ఇస్తున్నారు.



మిద్దెతోటపై పెంచుతున్న మొక్కలు



డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలు



జామకాయలు



నారింజ మొక్క



గుత్తి వంకాయి మొక్క



మొక్కల పెంపకం అంటే ఇష్టం..

మాకు మొక్కలుపెంచడం అంటే ఇష్టం. ఇప్పుడంతా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడి పండించిన కూరగాయలనే తినాల్సి వస్తోంది. అందుకనే మేడపైనే మిద్దె తోట సాగు చేపట్టాం. రోజుకు రెండు గంటల పాటు మిద్దె తోటలో పనిచేయడం వల్ల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

-వాసిరెడ్డి సుజాత, గృహిణి, కాకినాడ

నగర వనాల ఏర్పాటుకు ప్రాధాన్యం

కలెక్టర్ సగిలి షాన్ మోహన్



చేబ్రోలులో నగర వనం ఏర్పాటుపై పరిశీలన చేస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

గొల్లప్రోలు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నగర వనాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ సగిలి షాన్ మోహన్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నగర వనం ఏర్పాటుకు ప్రతిపాదించిన కంకరగని భూములను ఆయన శనివారం పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహశీల్దారు సత్యనారాయణ, సర్వేయర్ కేదారేశ్వరరావు, అటవీశాఖ అధికారులున్నారు. కాగా గొల్లప్రోలు పాత్‌హోల్స్ పూడ్చేందుకు అవసరమైన నిధులు 6.30లక్షలు నగరపంచాయతీ వద్ద అందుబాటులో లేని నేపథ్యంలో ఆ నిధులను తాను మంజూరు చేస్తానని కలెక్టర్ తెలిపారు.

మధ్యాహ్న బోజన పథక ఏజెన్సీ మార్పు

పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లోని పాఠశాలలుకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఆహార పదార్థాలు పంపుతున్న ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీని మార్పు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ ఏజెన్సీ పంపుతున్న ఆహార పదార్థాల నాణ్యత సరిగా ఉండడంలేదని అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని ఈనేపథ్యంలో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా ఆహార పదార్థాలు వండే బాధ్యతను ఇస్కాన్‌కు అప్పగించాలా లేదా పాఠశాలల వారీగా ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ ఏర్పాటు చేయాలా అనే అంశంపై పరిశీలన చేస్తున్నామన్నారు.

సుపరిపాలన అందించేందుకు పని చేద్దాం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చి, సుపరిపాలన అందించేందుకు సమష్టిగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి పని చేద్దామంటూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో గల కాపు కల్యాణ మండపంలో వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలు అమలు, సిబ్బంది పని తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది అందిస్తున్న సేవలు, విధులను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, తాగునీరు సరఫరాపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్బన్ డివిజన్ల పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పండూరు -1,2 లేఅవుట్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కూలీలకు నూటికి నూరుశాతం పని దినాలు పెంచి, అధికంగా నిధులు రాబట్టేలా కృషి చేయాలన్నారు. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో అధిక శాతం మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని, వారిని గుర్తించి ఈనెల 6లోపు ఓటర్లు చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్, తహశీల్దార్ వీఎల్ఎస్.కుమారి, ఈవోపీఆర్‌డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు, ఇంజనీరింగ్ అధికారి వాసుదేవరావు, ఎంఈవో వేణుగోపాలరావు, రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శి జొన్నాడ నరసింహరావు తదితరులు ఉన్నారు.

గుంతలు లేని రోడ్ల సాధన దిశగా ప్రభుత్వం

సిటీ ఎమ్మెల్యే కొండబాబు, గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ప్రారంభం



కాకినాడలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



సామర్లకోటలో పూడ్చివేత పనులు చేపట్టిన ఎమ్మెల్యే రాజప్ప, తుమ్మల బాబు

కాకినాడ సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు లేని రోడ్ల సాధన దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని జగన్నాథపురం అన్నమ్మఘాటీ సెంటర్ వద్ద శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రోడ్ల నిర్మాణం, మరమ్మతుల గురించి పట్టించుకోలేదన్నారు. దీంతో రోడ్ల మీద రాళ్లు లేచి గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా తొలిదశలో వంద రోడ్ల మరమ్మతులకు రూ.826 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు సాయిబాబారెడ్డి, కూటమి నాయకులు మల్లిపూడి వీరు, ఏంపి తాజుద్దీన్, ఎండీ అన్సర్, పాలిక నాని, గెడ్డం పూర్ణ, మేడిశెట్టి చిన్ని, కొక్కిలిగడ్డ గంగాధర్, పెదపూడి కుమార్, పిల్లి శివకుమార్, సంగాని నాగూర్, పాలెపు నాగరాజు, కొపనాతి నాగకుమారి, వడిశెల దాలమ్మ, జగదాంబ పాల్గొన్నారు.

సంతోషంగా ప్రయాణించాలి

తాళ్లరేవు: గుంతలు లేని రహదారులపై ప్రజలు సంతోషంగా ప్రయాణించేలా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కోరింగ పంచాయతీ సుబ్బారాయుడు దిమ్మ వద్ద రహదారి మరమ్మతులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. తాళ్లరేవు మండలంలో రోడ్లకు రూ.50లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి వెంకటరమణ, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, గంజా సూరిబాబు,రాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

మెరుగైన రహదారుల నిర్మాణం

పెద్దాపురం: రాబోయే రోజుల్లో మెరుగైన రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. పెద్దాపురం నుంచి జగ్గంపేట వేళ్లే ప్రధాన రహదారిలో స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన గుంతలు పూడ్చే కార్యక్రమంలో ఆయన జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి పాల్గొని మాట్లాడారు. కూటమి శ్రేణులతో కలిసి గుంతలు పూడ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, తూతిక రాజు, సకురు ప్రసాద్, కందుల విశ్వేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ రాఘవరావు, జేఈ సత్యప్రసాద్, మున్సిపల్ కమిషన్ కేవీ పద్మావతి పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట మాండవ్యనారాయణస్వామి ఆలయం సమీపాన కెనాల్ రోడ్డు గుంతలు పూడ్చే పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుతో కలిసి చేపట్టారు. సుమారు రూ.10లక్షల వ్యయంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డు పూడ్చే పనులకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం గుంతలు పూడ్చే పనులు ప్రారంభంలో భాగంగా పారచేతబట్టి నల్లకంకరను గమేళాలో వేసే పనులను రాజప్ప తుమ్మల చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పెద్దాపురం నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు బోళ్ళ వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



తాళ్లరేవు మండలం కోరింగలో రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల

కార్తీకమాస పూజలు ప్రారంభం





కరపలో స్వామివారిని అభిషేకిస్తున్న దృశ్యం, గొల్లప్రోలులో 108 రకాల పిండివంటలతో సమర్పించిన సారె



కాకినాడలో బాలాత్రిపురసుందరి కోనేటి వద్ద కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు

పోర్టుసిటీ(కాకినాడ), నవంబరు 2: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం నగరంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంవీధిలోని పురాతన బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి దేవాలయం, రామారావుపేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భానుగుడి సెంటర్‌లోని భానులింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. మహిళలు తెల్లవారుజామున శ్రీ బాలాత్రిపురసుందరి అమ్మవారి శ్రామిక పుష్కరిణి కోనేరులో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేకపూజలు చేశారు.

గొల్లప్రోలు: పట్టణంలోని కరణం గారి తోటలో కనకదుర్గమ్మకు గాజులతో అలంకారం చేశారు. సుమారు 10లక్షలకు పైగా చిన్నగాజులు వినియోగించారు. కార్తీకమాసం తొలిరోజు సందర్భంగా అమ్మవారికి 108 రకాల పిండివంటలతో సారె సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గొల్లప్రోలు శివాలయానికి తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి వచ్చి పాడ్యమి దీపాలు వెలిగించారు. ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు జరిగాయి.భక్తులు అధికంగా తరలివచ్చారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కార్తీకమాసం తొలిరోజు కావడంతో తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకారం చేసి సప్త హారతులు ఇచ్చారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు చేశారు.

కరప: కరప పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్ అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ, పెద్దాపురప్పాడు, పెనుగుదురు, చినమామిడాడ, కొరుపల్లి, అరట్లకట్ట, వేళంగి, వాకాడ, ఉప్పలంక తదితర గ్రామాల్లోని ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో కార్తీకమాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

పిఠాపురంలో డిప్యూటీ సీఎం పర్యటన ఇలా...

పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనకు సంబంధించి తాత్కాలిక షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో మార్పులు జరిగే అవకాశం కూడా ఉంది. ఈనెల 4వ తేదీ 10గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి 11.30గంటలకు గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. అక్కడ పిఠాపురం నియోజకవర్గంలోని పాఠశాలలకు మంజూరైన సైన్స్ ల్యాబ్‌లను, గొల్లప్రోలు పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2 నూతన భవనాలను ప్రారంభిస్తారు. గొల్లప్రోలు జగనన్న కాలనీకి మంజూరైన బ్రిడ్జి నిర్మాణంతోపాటు సూరంపేటకు మంజూరైన బ్రిడ్జి నిర్మాణానికి, గొల్లప్రోలు బాలుర ఉన్నత పాఠశాల భవనాల మరమ్మతుల పనులకు, అసంపూర్తిగా ఉన్న గొల్లప్రోలు అర్బన్‌హెల్త్ సెంటర్, తహసీల్దారు కార్యాలయ పూర్తికి చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అక్కడే విద్యార్థులతో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 1.15గంటలకు చేబ్రోలు చేరుకుని, విరామం అనంతరం 3.30గంటలకు పిఠాపురంలోని టీటీడీ కల్యాణ మండపం చేరుకుంటారు. అక్కడి నుంచి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. టీటీడీ ఆధ్వర్యంలోని వెంకటేశ్వరస్వామి మాడవీధులు, కల్యాణమండపం మరమ్మతులకు, బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాల మరమ్మతులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. అక్కడ నుంచి 5.30గంటలకు బయలుదేరి సాయంత్రం 6గంటలకు కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురంలో ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ ఇనిస్టిట్యూట్‌ను సందర్శిస్తారు. రాత్రి 7.30గంటలకు పవన్ తన చేబ్రోలు నివాసానికి చేరుకుని రాత్రి బస చేస్తారు.

5వతేదీన 10.30గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి 11.15గంటలకు కొత్తపల్లి పీహెచ్‌సీకి చేరుకుంటారు. పీహెచ్‌సీలో అవుట్ పేషెంట్‌బ్లాకు నిర్మాణానికి, ఇసుకపల్లి, రవీంద్రపురం, నిదానందొడ్డి, శొంటివారిపాకలులోని మండల పరిషత్ పాఠశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. కొత్తపల్లి మండలంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణంపై ప్రకటన చేయనున్నారు. అక్కడ నుంచి 1.30గంటలకు చేబ్రోలు నివాసానికి, మధ్యాహ్నం 3గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్తారు.

భవనాల మరమ్మతులకు రూ.19లక్షలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

గొల్లప్రోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిథిలమైన భవనాల మరమ్మతులకు రూ.19లక్షల నిధులు విడుదల కానున్నాయి. ఉన్నత పాఠశాలలో ఏడేళ్ల క్రితం నిర్మించిన తరగతి గదుల పైకప్పులు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయని, ఈ భవనాలు శిథిలావస్థకు చేరడం, నాడు-నేడు కింద నిర్మించిన భవనాలు అసంపూర్తిగా ఉండిపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో ఎస్ఎస్ఏ ఈఈ జయకర్, డీఈఈ వెంకట్రావులు గొల్లప్రోలు చేరుకుని పాఠశాల భవనాలు పరిశీలించారు. వీటి మరమ్మతులకు రూ.19లక్షలు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసి కలెక్టర్‌కు నివేదించారు. మరమ్మతులకు నిధులు ఇవ్వనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి : డీఎస్పీ

జేఎన్టీయూకే, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా గమ్యానికి సురక్షితంగా చేరవచ్చని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు అన్నారు. జేఎన్టీయూకేలోని అలూమ్నీ ఆడిటోరియంలో యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ మాట్లాడారు. సీఐలు డి.రామారావు, ఎస్.రమేష్, బి.పెద్దిరాజు, ఎస్ఐ వెంకటరత్నం, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి నలుగురికి స్వల్ప గాయాలు

పెద్దాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వారపుసంత జంక్షన్ వద్ద ఆటో బోల్తా పడి నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక దర్గాసెంటర్ వద్ద ఉన్న ఓ మాల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు శనివారం ఆటోలో వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది.

డీఎమ్‌హెచ్‌వో తనిఖీ



గొల్లప్రోలు యూపీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎమ్‌హెచ్‌వో నరసింహనాయక్

గొల్లప్రోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న యూపీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి పూర్తి చేసేందుకు రూ.18లక్షలతో పనులనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన పరిశీలన జరిపారు. అక్కడ చేయవలసిన పనులపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాజు, స్టాటికల్ ఆఫీసర్ గిరి గణేష్, వైద్యాధికారి డాక్టర్ రామ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు కొండంత అండగా టీడీపీ

రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

కొత్తపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా కొండంత అండగా నిలుస్తుందని రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఉప్పాడ శివారు మాయాపట్నంలో శనివారం తెల్లవారుజామున షార్ట్ షర్క్యూట్ కారణంగా టీడీపీ మహిళా కార్యకర్త మడికి సత్యవతి ఇల్లు మంటల్లో కాలిపోయింది. బాధితురాలిని వర్మ పరామర్శించి వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా రూ.20వేల నగదును సాయంగా అందించారు. అలాగే మడికి సత్యవతి కుటుంబాన్ని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పరామర్శించి రూ.10వేలు అందించారు. జనసేన వైద్యవిభాగం ప్రతినిధి, సురక్ష ప్యాలెస్ అధినేత డాక్టర్ జ్యోతులశ్రీనివాస్ పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ

కరప, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్వర్ సమస్య తలెత్తినా లబ్ధిదారులకు పింఛన్లను సకాలంలో అందజేసినట్టుగా కరప ఎంపీడీవో మట్టపర్తి అనుపమ తెలిపారు. మండల వ్యాప్తంగా 11,416మంది లబ్ధిదారులు వివిధ రకాల పింఛన్లను పొందుతుండగా శనివారం సాయంత్రానికి వారిలో 11,313 మందికి పింఛన్ అందించామన్నారు. అందుబాటులో లేని కారణంగా 67మంది లబ్ధిదారులకు అందించలేకపోయామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో శనివారం సాయంత్రం 4.45 గంటలకు 99.10 శాతం మందికి పింఛన్లు అందజేయగలిగామని ఎంపీడీవో అనుపమ చెప్పారు.

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, నవంబరు 2: కాకినాడలో ఈనెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో మేనేజర్, రిటైల్ సేల్స్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నీషియన్, కెమిస్ట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376111నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు దండపాణి గురుస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ

పోర్టుసిటీ(కాకినాడ), నవంబరు 2: ఆధ్యాత్మికవేత్త దండపాణి గురుస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం జరుగుతుందని అయ్యప్పస్వామి దేవాలయం పర్సన్ ఇన్‌చార్జి పి.గోపాలకృష్ణ తెలిపారు. భానుగుడి పోలీస్ రిజర్వ్‌లైన్‌లోని దేవాలయం ఆవరణలో నిర్వహించే గురుస్వామి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాత్రి 7.11కి ప్రతిష్ఠ చేస్తామన్నారు.

భీమేశ్వరాలయంలో రాష్ట్ర ఉపలోకాయుక్త పూజలు

సామర్లకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపలోకాయుక్త పి.రజని శనివారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఉపాలయాలు అనంతరం భీమేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద వేద పండితులతో వేదాశీస్సులు అందజేసి ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు. రజని వెంట తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి, వీఆర్వోలున్నారు.

కంప్యూటర్లు బహూకరణ

సామర్లకోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉండూరు ప్రకాశరావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన దాతలు చక్కని ప్రభాకరరావు, వెన్నపు గంగాకృష్ణ, డి.దొరబాబు సొంతనిధులతో 13 కంప్యూటర్లు, ఎల్ఈడీ స్క్రీన్‌లను శనివారం అందజేసినట్లు సామర్లకోట ఎంఈవో పి.పుల్లయ్య తెలిపారు. దాతల కృషిని గ్రామస్తులు అభినందించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

సర్పవరం జంక్షన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ ధర కంటే అదనంగా మద్యం విక్రయించినా, ఎక్కడైనా బెల్ట్ దుకాణం ఏర్పాటు చేసినా సంబంధిత దుకాణం నిర్వాహకుడి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని ఎక్సైజ్ నార్త్‌స్టేషన్ సీఐ రామ్మోహన్ హెచ్చరించారు. హార్బర్‌పేటలో బెల్ట్ షాప్ వద్ద వివాదం అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. శనివారం కాకినాడ రూరల్ వాకలపూడి హర్బార్‌పేటలో పలు పాన్ షాపులపై సిబ్బందితో దాడులు నిర్వహించారు. 2 లీటర్ల నాటుసారాతో మల్లాడి పద్మను అదుపులోకి తీసుకున్నారు. సీఐ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీకి అనుగుణంగా వ్యాపారులు మద్యం విక్రయాలు జరుపుకోవాలన్నారు. మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూమ్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు జారీ చేయలేదన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఓటు నమోదు చేయించుకోవాలి'

కరప, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్టభద్రులందరూ ఈనెల 6వ తేదీలోగా గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో శనివారం కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలతో ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రాడ్యుయేట్ ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. 2021 అక్టోబరు 31లోగా డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులన్నారు. ఓటర్ ఐడీ, ఆధార్‌కార్డు, గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, పాసుపోర్టు సైజు ఫొటోను ధరఖాస్తుకు జత చేసి ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఘనంగా లక్షపత్రి పూజ

కోటనందూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బొద్దవరం గ్రామంలో కార్తీకమాసం పురస్కరించుకుని అయ్యప్ప స్వామికి లక్షపత్రి పడిపూజను శనివారం రాత్రి గొల్లప్రోలుకు చెందిన గురుస్వామి సిద్దా నానాజీ స్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. నిర్వాహకులు మళవీరబాబు, యల్లపులక్ష్మాజీతో పాటు గురుస్వామి ఆర్లి శ్రీనివాస్, వెంకటరమణమూర్తి తదితరులున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రేపు చలో రంపచోడవరం ఐటీడీఏకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకుడు శేఖర్

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 4వతేదీన ఆదివాసీ జేఏసీ, ఆదివాసీ నిరుద్యోగుల జేఏసీ తలపెట్టిన ఛలో రంపచోడవరం ఐటీడీఏకు ఆదివాసీ నిరుద్యోగులంతా తరలిరావాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగులకు ఎన్నికల ప్రచారంలో భాగంగా అరకు బహిరంగ సభలో ప్రస్తుత సీఎం చంద్రబాబు జీవో నెం.3ను పునరుద్ధరిస్తానని వందశాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీను నిలబెట్టుకోవాలన్నారు. 2024 జనరల్ డీఎస్సీ లో ఏజెన్సీ పోస్టులపై స్పష్టత ఇచ్చి వందశాతం ఉద్యోగాలు ఆదివాసీ పట్టభద్రులతోనే భర్తీ చేయాలన్నారు. వీటి డిమాండ్ సాధన కోసం ఈనెల 4న రంపచోడవరం అంబేద్కర్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఛలో రంపచోడవరం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, దేవీపట్నం మండల ఆదివాసీ జేఏసీ కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, సింబోతుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జెన్‌కోలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో పాల్గొన్న సిబ్బంది

మోతుగూడెం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్జీవో ఎండీ చక్రధర బాబు, సీవీఎస్‌వో పవన రెడ్డి ఆదేశాల మేరకు లోయర్ సీలేరు మోతుగూడెంలో ఉన్న జెన్‌కో కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు విజిలెన్స్‌పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. లంచం తీసుకోవడం ఇవ్వడం నేరమన్నారు. అనంతరం ఉద్యోగులచేత విజిలెన్స్ అవెరెన్స్ వీక్-2024 ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఈ చిన్న కామేశ్వరరావు, ఈఈ బాలకృష్ణ, జెన్కో ఉద్యోగస్తులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం పంచాయతీపరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మట్టితవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో శనివారం తహసీల్దార్ కె.సత్యనారాయణ, ఎస్ఐ కె.షరీఫ్ సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. అనుమతులు లేకుండా రెండు కిలోమీటర్ల మేర రహదారి ఏర్పాటుచేసుకుని కొంతమంది వ్యక్తులు రాత్రి సమయాల్లో లారీలతో ఎర్ర మట్టిని మైదానప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం వచ్చిందన్నారు. అక్కడ పరిస్థితి సమీక్షించి ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపామన్నారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిగితే చర్యలుతీసుకుంటామన్నారు.

భూ రికార్డులపై గ్రామసభ

వై.రామవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా శనివారం మండలంలోని దదిలికివాడ గ్రామంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. భూ యజమానులకు తమ భూముల రికార్డులను మార్పులు, చేర్పులు జరుపుకోవాలని ఎక్కువ భూములున్నవారు వారి స్వీయ అంగీకారంతో కుటుంబీకులకు పంపిణీచేసిన భవిష్యత్ తరాలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌రావు మాట్లాడుతూ భూపట్టాల్లో మ్యుటేషన్లను తప్పనిసరిగా జరిపించుకోవాలనే అంశాలపై సూచనలు ఇచ్చారు. సర్వేయర్లు, వీఆర్ఓ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ల పోస్టులకు 5న ఇంటర్వ్యూలు

రంపచోడవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 2024-25కిగాను రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గెస్ట్ టీచర్లు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, డెమో ఇచ్చిన అభ్యర్థులు ఈనెల 5న మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం శనివారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

150 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం పంచాయతీ పరిధిలో మారుమూల పొదల్లో సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ కె.షరీఫ్ శనివారం అక్కడికి వెళ్లి 150లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా నాటుసారా తయారీ చేసిన, విక్రయించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టుషాపులు నిర్వహించిన, అక్రమంగా అమ్మకాలు జరిగిన చర్యలు తప్పవన్నారు.

కేజీబీవీ విద్యార్థినికి అస్వస్థత

ఎటపాక,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎటపాక కేజీబీ వీలో పదో తరగతి చదువుతున్న గంపల భద్రకేళి అనే విద్యార్థిని శుక్రవారం సాయంత్రం అస్వస్థతకులోనై, స్పృహ కోల్పోవడంతో వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినికి జ్వరం రావడంతో నీరసించి, స్పృహకోల్పోయినట్లు తెలుస్తోంది. వెంటనే ఉపాధ్యాయులు బాలికను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నీరసించడం వల్ల బాలిక అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం విద్యార్థిని సాధారణ స్థితికి చేరుకుంది.

గండిపోశమ్మ దర్శనాలు నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో శ్రీ గండి పోశమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద గోదావరి వరద కొంచెం తగ్గినప్పటికీ దేవాలయాన్ని శుభ్రపరిచే పనులు జరుగుతున్న కారణంగా తాత్కాలికంగా దర్శనాలు నిలుపుదల చేసినట్లు జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలన్నారు.

స్కిల్ నైపుణ్యంపై శిక్షణ

వై.రామవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. స్కిల్ నైపుణ్యం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని దీన్ని యువతీ యువకులు వినియోగించుకోవాలని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సున్న వారి వివరాలు యాప్‌లో డౌన్‌లోడ్ చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో మద్యం షాపు ఏర్పాటుకు బ్రేక్

రాజవొమ్మంగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గ్రామంలోని విద్యానగర్‌లో ఇళ్ల మధ్యలో మద్యం షాపు ఏర్పాటుపై గ్రామస్థులు రోడ్డెక్కి నిరసన చేపట్టిన ఘటన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన విష యం తెలిసిందే. ఘటనపై ఎక్సైజ్ సీఐ శ్రీధర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ విద్యానగర్‌లో మద్యం షాపు ఏర్పాటుకు నిర్వహకులు శాశ్వత లైసెన్స్ కోరుతూ దరఖాస్తు చేసుకున్నారని, అయితే ప్రజల నుంచి వ్యతిరేకత ఉండడంతో తాత్కాలికంగా అక్కడ మద్యం షాపు ఏర్పాటుకు లైసెన్స్‌ను నిలిపివేశామని సీఐ తెలిపారు. ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ రాజవొమ్మంగి తహశీల్దార్, పంచాయతీ కార్యాలయాల్లో గ్రామస్థులు శనివారం వినతిపత్రం అందజేశారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

మోతుగూడెం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డ గండి పంచాయతీ డొంకరాయిలో సీఐటీయూ జెండాను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. నిరంతరం కార్మిక హక్కుల సమస్యలపై పనిచేస్తున్న సంఘం సెంట్రల్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ అని చెప్పారు. అంగన్‌వాడీ, ఆశ వర్క ర్లు మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు, ఉపాధి, విద్యుత్ పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు అసంఘటిత రంగ కార్మికులు తమ సమస్యలపై పోరాడి అనేక హక్కులను సాధించుకున్నారన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ఐదు లక్షల బీమా

టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు

రాజవొమ్మంగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో ఐదు లక్షల రూపాయల బీమా వర్తిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. శనివారం మండలంలోని శరభవరం, గడువకుర్తి పంచాయతీలలో టీడీపీ నేతలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని పెద్దిరాజు అన్నారు. జడ్పీటీసీ వడుగుల జ్యోతి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కనిగిరి శ్రీనివాసు, జెట్టి మధు, తదితరులు ఉన్నారు.

గుంతలు రహిత రోడ్లే లక్ష్యం

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగ్గంపేటలో పార పట్టి గుంతలు పూడ్చేందుకు మట్టి తీస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల భద్రత దృష్ట్యా మిషన్ పాట్ హెల్ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ నుంచి జగ్గంపేట వచ్చే రహదారిలో కోనేది వద్ద గుంతలపూడ్చే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించి ఎమ్మెల్యే పారపట్టి గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లు బాగు కోసం కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జనవరి నాటికి గుంతలు రహిత రోడ్లను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయిలతో సిమ్మెంటు రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, జీను మణిబాబు, బొల్లం రెడ్డి రామకృష్ణ, జనసేన నాయకులు రామకుర్తి నరసింహమూర్తి, దేగల సత్తిబాబు, నాండ్ల చిరంజీవి, కొండ్రోతు శ్రీను, సొంబత్తుల చంద్రశేఖర్, కంటిపూడి రామారావు, మహిళాశక్తి కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ప్రతీ సమస్యకు పరిష్కారం'

తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాదికి నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులను చూడడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తుని శివారు కుమ్మరి లోవ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం నేటి ప్రజలకు శాపంగా మారిందని, కూటమి ప్రభుత్వంలో ప్రతీ సమస్యకు పరిష్కారం ఉండి తీరుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, సుర్ల లోవరాజు, జక్కాన రామునాయుడు, గేదెల కృష్ణమూర్తి, చింతమనేని అబ్బాయి తదితరులు ఉన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

ప్రత్యేక పూజలు, అభిషేకాలు



ఏలేశ్వరంలో శివలింగానికి భక్తుల పూజలు



రౌతులపూడిలో శివాలయం వద్ద భక్తులు

తుని రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాస ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శివ క్షేత్రాలలో కార్తీక శోభ సంతరించుకుంది. ఆధ్యాత్మిక పీఠం తపోవన క్షేత్రం, తేటగుంట శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయం, కత్రాళ్ళ కండు వద్ద తాండవ లింగేశ్వర ఆలయం, తిమ్మాపురం శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో వేకువ జామునే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపం వదిలి శివ పూజల్లో తరించారు.

ఏలేశ్వరం: తెల్లవారుజాము నుంచి భక్తులు ఏలేరు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి దర్శించుకున్నారు. అర్చకులు మహేష్, శేఖర్, వెంకటేష్ ప్రత్యేక పూజలుచేసి ప్రసాదాలు అందజేశారు.

కిర్లంపూడి: తామరాడ శ్రీకృష్ణసాయి మందిరంలో 30 రోజులు దీపోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు భక్తులు ప్రబోలు కృష్ణ, వీరవెంకటలక్ష్మి దంపతులు దీపోత్సవం చేశారు.

ప్రత్తిపాడు: మండలంలోని రాచపల్లిలోని అపీత కుటుంబ సమేత అరుణాచలేశ్వరాలయంలో యజ్ఞ యాగాలు నిర్వహించి స్వామి అమ్మవార్లకు అభిషేకాలు ప్రత్యేక అలంకరణలు చేశారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ధర్మవరంలో రాజరాజేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి, ఒమ్మంగిలో ఉమా రామలింగేశ్వర ఆలయాలు కిటకిటలాడాయి.

రౌతులపూడి: రౌతులపూడి, శృంగవరంలో నందవనం భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామునే ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

తుని రూరల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవకు తరలివస్తున్న భక్తులు అప్రమత్తంగా ఉండాలని తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు సూచించారు. లోవలో భక్తుల డబ్బులు కాజేస్తున్న 11 మందిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మళ్లీ ఇలా చేస్తే ఉపేక్షించేది లేదని.. పీడీయాక్ట్, వంటి సెక్షన్లు వేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కాశీకి పాదయాత్ర

తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి ఆధ్యాత్మిక పీఠం శ్రీ తపోవన క్షేత్రం నుంచి తునికి చెందిన శ్యాంబాబు, వీరబాబు అను శివ భక్తులు పాదయాత్రగా కాశీకి పయనమయ్యారు. పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ ఆశీర్వచనాలు తీసుకుని తుని నుంచి పాదయాత్రను ప్రారంభించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య



కోటనందూరు మండలం బిళ్లనందూరులో ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న దివ్య

తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం తునిలో శనివారం నిర్వహించి మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆడబిడ్డలకు పెద్దపీట వేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, సుకుమంచి శోభారాణి, యినిగంటి సత్యనారాయణ, దంతులూరు శ్రీనివాసరాజు, పరవాడ తాతబాబు, అల్లు రాజు, బోడపాటి శ్రీను, సిద్ధాంతపు సత్తిబాబు, జల్లు వాసు తదితరులున్నారు.

కోటనందూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి తీరతామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మండలంలోని బిళ్లనందూరులో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్యక్షతన ఆమె మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతం నీడి అబ్బాయి, డి.చిరీంజీవిరాజు, వెలగా వెంకట కృష్ణారావు, గొర్లి అచ్చియ్యనాయుడు, అంకంరెడ్డి రమేష్, బైలపూడి శ్రీరామమూర్తి, పోతల సూరిబాబు, అంకంరెడ్డి బుల్లిబాబు, తహశీల్దార్ సుభాష్, ఎంపీడీవో వెంకటనారాయణ పాల్గొన్నారు.

'రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

కిర్లంపూడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కోరారు. శనివారం మండలంలోని బూరుగుపూడి, కృష్ణవరం గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాల్లో నవీన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు గడువు ముగుస్తుందని త్వరితగతిన ఓట్లు నమోదు చేసుకోవాలన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇస్తున్నామని, పెళ్లి కానుక రూ.20వేలు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లు, తాగునీటి పైపు లైన్లు తదితర పలు సమస్యలను నవీన్ దృష్టికి కార్యకర్తలు తీసుకెళ్లారు. ఎంపీపీ తోట రవి, పారంశెట్టి రవి, కర్నాకుల పెదకాపుస్వామి, కుంచే తాతాజీ, మూరా సత్తిబాబు, పాటంశెట్టి విశ్వనాధం, బొదిరెడ్ల సుబ్బారావు, సుమన్ ఉన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూకు అభినందనలు

జగ్గంపేట, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఇటీవల టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఏలేశ్వరం నగర పంచాయతీ కౌన్సిలర్ బోదిరెడ్డి గోపి, ఏలేశ్వరం టౌన్ టీడీపీ అధ్యక్షులు ముది నారాయణ స్వామి, టీడీపీ నాయకులు అనంతరపు రాజు, సామంతుల గోపి, మల్లేపల్లి ఉపసర్పంచ్ దొమ్మ శ్రీను, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు ఉన్నారు.

బాధితులకు సాయం

జగ్గంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం రంపయర్రంపాలెం పంచాయతీ పరిధి పెంటపల్లిలో అగ్నిప్రమాదంలో కొండ కృష్ణ తాటాకిల్లు దగ్ధమైంది. బాధితులను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, నాయకులు పరామర్శించి నిత్యావసరాలు,కూరగాయాలు అందించారు.

విద్యార్థుల ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రత్తిపాడులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శన, ధర్నా ఆందోళన నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రూ.3480 కోట్లు విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ నరసింహమూర్తి, బాలగంగాధర్, సాయి, సిద్దు, వెంకట్ పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం : డీఎస్పీ



అల్లూరి దాడి చేసిన పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

రాజవొమ్మంగి నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, సాగు చేస్తే కఠినచర్యలు తప్పవని రంపచోడవరం డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపారు. ఇటీవలే రంపచోడవరం డీఎస్పీగా సాయిప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం రాత్రి రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే అంశా లపై ఆయన సమీక్షించారు. సంకల్ప్ అనే కార్యక్రమం ద్వారా గంజాయి నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు దాడిచేసిన పోలీసు స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి, ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తదితరులు ఉన్నారు.

కార్తీక మాస తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు

రంపచోడవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాస తీర్థ యాత్రలకు గోకవరం ఆర్టీసీ బస్ డిపో నుం చి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు రామన్నదొర తెలిపారు. పంచారామ, కృష్ణాతీర, కోనసీమ, శ్రీశైలం, ఉత్తరాంధ్ర, తెలంగాణ పంచారామ, శ్రీసీతారామ, అరుణాచల శివక్షేత్రాలకు ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటుచేశామని వివరాలకు ఫోన్: 7382910258, 7382910321కు సంప్రదించాలని తెలిపారు.

'మాదిగ ఉపకులాలకు తగిన ప్రాధాన్యమివ్వాలి'

తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఎన్నికల్లో మాదిగ ఉపకులాలు టీడీపీకి అనుకూలంగా పని చేశాయని ప్రభుత్వం కూటమి ప్రభుత్వంలో తమకు తగిన ప్రాధాన్యతనిస్తూ, తమ సామాజికవర్గానికి న్యాయం చేయాలని కాకినాడ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పలివెల శివమణి కోరారు. ఈ నెల 11న ఎమ్మార్పీఎస్ మహాసభలకు హాజరుకావాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడికి తేటగుంట క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 2024 డిసెంబర్ నాటికి కుల గణన ప్రక్రియ పూర్తి చేసి మాదిగలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలివెల సతీష్, గంగబాబు, సురేష్ తదితరులున్నారు.

రామ్‌కుమార్‌కు ఘన నివాళి

అన్నవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సుమారు 36 సంవత్సరాలు చైర్మన్‌గా వ్యవహరించిన రామ్‌కుమార్ 9వ వర్ధంతి సందర్భంగా ఆయనకు శనివారం చైర్మన్ బంగ్లాలో పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, గ్రామస్థులు, ఉద్యోగులు ఘన నివాళులర్పించారు. ముందుగా ప్రస్తుత చైర్మన్ రోహిత్ ఆయన తండ్రికి నివాళులర్పించారు. అన్నవరం ఆలయ అభివృద్ధి, గ్రామాభివృద్ధికి ఆయనచేసిన సేవలకు వక్తలు కొనియాడారు. అనంతరం పేదలకు దుస్తులు, పళ్ల పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

12 నుంచి చండీయాగం

గండేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఈనెల 12 నుంచి 16 వరకు చతుర్వేద పారాయణ పురస్సర శ్రీ సహస్ర చండీయాగం నిర్వహించనున్నట్లు ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి తెలిపారు. 12న ఉదయం 5గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని... గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాదారణ, గోపూజ, యజ్ఞశాల సంస్కారం, అఖండ దీపారాధన రుద్రాభిషేకం, చండీ హోమం, చండీ పారాయణ, నీరాజనం మంత్ర పుష్పం కార్యక్రమాలు, ఐదోరోజు మహా పూర్ణాహుతి అన్నసమారాధన జరుగుతుందన్నారు.

సీపీఎం కన్వీనర్‌గా శ్రీనివాస్

తుని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా నక్కెళ్ళ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తుని సీపీఎం కార్యాలయంలో పార్టీ శాఖల సమావేశం జరిగింది. జిల్లా నాయకులు బేబిరాణి, శేషబాబ్జి, అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తుని నియోజకవర్గ కన్వీనర్‌గా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనకు ప్రజా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రన్నాయుడికి నివాళి

రౌతులపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసి తెలుగు వారి గొంతుకను పార్లమెంట్‌లో గట్టిగా వినిపించిన నాయకుడు ఎర్రన్నాయుడని మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. ఆయన నివాసంలో వర్ధంతిని నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కైశర్ల సత్యనారాయణ, ఇటంశెట్టి అశోక్ మూర్తి, పసగడుగుల రమణ,సుర్లజేమీలు పాల్గొన్నారు.